క్లుప్తంగా

పంట నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏవో షేక్షావలి

నందికొట్కూరు రూరల్ : మండలంలో రైతులు రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలను తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని ఏడీఏ విజయశేఖ సూచించారు. బుధవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో పంటనమోదుపై ఏవో షేక్షావలి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంట నమోదుకు సంబంధించిన వివరాలను సరి చూసుకుని ఏవైనా తప్పులు ఉంటే అధికారులకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, మల్యాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లనాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు

వైఎస్సార్ బీమా పేదలకు వరం

నందికొట్కూరు: వైఎస్సార్‌బీమా పథకం పేదలకు వరమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 27వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన పద్మావతమ్మ కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు నగదును వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

దొంగల ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



డీజిల్ ఇంజిన్ చోరీకి గురైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పగిడ్యాల: వ్యవసాయ పనిముట్లైన రోటవేటర్లు, డీజిల్ ఇంజిన్‌లను దొంగిలించి రైతులను ఆర్థికంగా నష్టాల పాలు చేస్తున్న దొంగల ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుల్ మల్లయ్య బుధవారం పగిడ్యాలలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. నేర స్థలాన్ని పరిశీలించి బాధిత రైతుల నుంచి మరింత సమాచారాన్ని తెలుసుకున్నారు. గ్రామాల్లో అనుమానస్పదంగా సంచరించే వ్యక్తుల సమాచారాన్ని వెంటనే స్టేషన్‌కు అందజేయాలని కోరారు. ఏ చిన్న క్లూ దొరికినా ఎస్ఐ దృష్టికి తేవాలని బాధిత రైతులకు సూచించారు.

జాతీయ గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డుకు ఎంపిక

నందికొట్కూరు: విశాఖపట్టణం బోడవరం చిత్ర కళా నిలయం 6వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు సెప్టెంబర్ 15వ తేదీన దేశెట్టి శ్రీనివాసులు (ఆర్ట్ శ్రీను) తన చిత్రాలను పంపారు. 'చెట్లను నరకవద్దు-మానవాళికి ముప్పు తేవద్దు' అనే సందేశాత్మక చిత్రాన్ని జాతీయ గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆర్ట్ శ్రీనుకు బుధవారం నిర్వాహకులు బొద్దేటి సూర్యనారాయణ సమాచారం అందించారు. వచ్చే నెల 4న విశాఖపట్టణంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు అవార్డు గ్రహీత తెలిపారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని పాములపాడు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 26న మద్దూరు, బానుముక్కల, 27న వేంపెంట, పాములపాడు, 28న పాములపాడు, జూటూరులో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, పాఠశాలల హెచ్ఎలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు, విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ నిమజ్జనం



దుర్గమ్మను నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

ఆత్మకూరు: దేవీశరన్నవరాత్రుల సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాలను బుధవారం ఊరేగింపుగా నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. పట్టణంలోని రాజా వీధిలో కొలువుదీరిన దుర్గామాత ఆ కాలనీలో తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి మంగళవాయిద్యాల మధ్యన ఊరేగింపు నిర్వహిస్తూ ఎర్రగూడూరు ఎస్ఆర్ఎంసీ కాలువ వద్దకు తీసుకువెళ్లి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆటోవాలా.. ఆనంద హేల

- ఐదో విడత వాహనమిత్ర సాయం బ్యాంకు ఖాతాలో జమ
- నియోజకవర్గంలో 1,424 మందికి లబ్ధి
- కష్టకాలంలో ఆదుకున్న జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు



నందికొట్కూరు: వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం ఆటో కార్మికులల్లో ఆనందోత్సాహాన్ని నింపింది. కష్టకాలంలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో ఆటో కార్మికుల కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆటో కార్మికుల ఇబ్బందులు తెలుసుకుని వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాసంకల్ప యాత్రలో హామీచ్చారు. ఈ మేరకు ప్రతి ఏటా రూ.10వేలు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ఈ ఏడాది ఎండీయూ ఆపరేటర్లకు కూడా..

నియోజకవర్గంలో సుమారు 1,424 మంది వాహనదారులకు సెప్టంబర్ 29వ తేదీన వాహన మిత్ర కింద ఐదో విడత నగదు సాయాన్ని బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదో సారి ఆర్థిక సాయం బటన నొక్కి జమ చేశారు. సొంత వాహనంతో ఉపాధి పొందుతున్న ఆటో, ట్యాక్సీ, మాక్సీ, క్యాబ్ డ్రైవర్ కం ఓనర్లకు ఇచ్చిన హామీ మేరకు వరుసగా నాలుగేళ్ల ప్రతి ఏటా ఇన్సురెన్స్, రోడ్డు ట్యాక్స్ నిమితం రూ. 10 వేలు వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా అందిస్తూ ఆదుకుంటున్నారు. ఈ ఏడాది అదనంగా ఇంటింటికీ రేషన్ డెలివరీ చేసే ఎండీయూ ఆపరేటర్లకు సైతం ఈ పథకాన్ని వర్తింపజేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.10 వేలు జమ చేసి ఆదుకోవడంతో సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటామని ఆటో కార్మికులు చెబుతున్నారు..

కష్టకాలంలో తోడుగా జగనన్న ప్రభుత్వం



కష్టకాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తోడుగా ఉంది. వాహన మిత్ర పథకం కింద రూ, 10 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేశారు. సీఎం వైఎస్ జగనన్న రుణం తీర్చుకోలేం. ప్రతి ఏటా రూ.10 వేలు ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్సీ కింద ఆటోవాలాల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. అర్హతలున్నా ప్రతి ఒక్కరికి ఎలాంటి సిఫారసు లేకుండా లబ్ధి చేకూరుతోంది. – రవి, ఆటో ఓనర్, నందికొట్కూరు

సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ఆటోవాలాల కష్టాలు తెలుసుకుని ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్సీ ప్రతి ఏడాది బ్యాంకు ఖాతాలో రూ, 10 వేలు జమ చేస్తున్నారు. ఆయన రుణం తీర్చుకోలేం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవడంతో బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేయడం హర్షించదగ్గ విషయం. ప్రతి ఏటా సీఎం వైఎస్ జగనన్న బ్యాంకు ఖాతాలో జమ చేయడం రుణం తీర్చుకోలేం. – శేషన్న, ఆటో ఓనర్, నందికొట్కూరు

ఐదు విడతల్లో రూ.50వేలు వచ్చాయి



వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా వరుసగా ఐదో సారి ఆర్థిక సాయం అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఆటో నడుపుకునే మాలాంటి పేద కుటుంబానికి ఆసరాగా ఆర్థిక సాయం రూ, 10 వేలు అందించిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలి. ఐదు దఫాలుగా రూ. 50 వేలు వచ్చా,యి. ఎవరి చుట్టూ తిరగకుండా ఎవరికీ పైసా ఇవ్వకుండా నేరుగా లబ్ధి చేకూరింది. ఇంతకన్నా ఏం కావాలి. – రమణ ఆటో ఓనర్, నందికొట్కూరు

సమస్యల పరిష్కారం కోసమే సమావేశాలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి

కొత్తపల్లి: సమావేశాల్లో తెలుసుకున్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా రూపుమాపినప్పుడే ఆ సమావేశాలకు సార్థకతలభిస్తుందని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అయా శాఖ అధికారులు వారి పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, అమలు అయిన ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి, జరుగబోయే అభివృద్ధిపనులు, అమలు అవుతున్న పథకాల గురించి వివరించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు వారి పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ.. సభదృష్టికి వచ్చిన ప్రతి సమస్యను అధికారులు నోట్‌చేసుకొని పరిష్కారానికి ప్రజాప్రతినిధులతో కలిసి కృషి చేయాలన్నారు. అధికారులు వెంటనే సమస్యలపై స్పందిస్తే పరిష్కారం అవుతాయాని అన్నారు. అదేవిధంగా జానాలగూడెంలో ఉపాధ్యాయుడులేక గిరిపుత్రులు చదువుకు దూరం కాకుడదని వెంటనే అధికారులు జిల్లా అధికారులతో మాట్లాడి వారికి విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, వైస్ ఎంపీపీలు సింగారం వెంకటరమణ (రంగ), జయమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహిళలు జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలి

జూపాడుబంగ్లా: ప్రతి మహిళ జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం అంబమ్మ అన్నారు. బుధవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా పొదుపుసంఘాల్లోని మహిళలు ఒక్కొక్కరు రూ.200ల చొప్పున పొదుపు చేసుకోవాలన్నారు. ప్రతి సంఘంలోని సభ్యులు సభ్యత్వం, వాటాధనం చెల్లించాలన్నారు. చెల్లించిన వారికి మాత్రమే స్త్రీనిధి, ఉన్నతి, హెచ్‌డీ, బ్యాంకు లింకేజీ రుణాలు వర్తిస్తాయని చెప్పారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకొన్న వారు ప్రతి నెల నెలా క్రమం తప్పకుండా కంతులు చెల్లించాలని సూచించారు. క్రమం తప్పకుండా రుణాలు చెల్లించిన సంఘాల్లోని పొదుపు మహిళలు తీసుకొన్న లోన్ మొత్తంల్లోంచి కేవలం రూ.3లక్షలకు మాత్రమే వడ్డీలు తిరిగి వస్తాయని తెలిపారు.

ఆనందోత్సాహాలతో వసంతోత్సవం



పట్టణంలో వసంతోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

ఆత్మకూరు: పట్టణంలో దేవినవరాత్రుల సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆనందోత్సాహాలతో వసంతోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు భీమిశెట్టి కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ పువ్వాడ భాస్కర్ మాట్లాడుతూ శ్రీవాసవికన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి నవరాత్రుల సందర్భంగా వివిధ.అలంకరణలు, కుంకుమార్చన, విశేష పూజలు , హోమాలు నిర్వహించామన్నారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామోత్సవం అనంతరం చివరి రోజు వసంతోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సాయిబాబ, బాలాజీ గణేష్ తో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి

జూపాడుబంగ్లా: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించటం తగదని ఏఐటీయుసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన జూపాడుబంగ్లాలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రూపొందించి.. కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 31న ఏఐటీయూసీ 104 వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, దివాకర్, సలీం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా రక్షణ భేరీ'ని విజయవంతం చేయండి

ఆత్మకూరు: రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన ప్రజారక్షణ భేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, మండల, పట్టణ అధ్యక్షులు నరసింహనాయక్, రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయమీటింగ్‌హాల్‌లో ప్రజా రక్షణ భేరీ పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ప్రాజెక్టులు ఉన్నా.. నీటికి కరువేనని, రైతులకు కావాల్సిన సాగు నీటి విడుదలలో ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లీటర్ పెట్రోల్ రూ.60 నుంచి 120 లకు పెంచిందని రూ.400 గ్యాస్ ధరను రూ.1000కి పెంచడంతో పాటు అన్ని నిత్యవసర సరుకుల ధరలు పెంచిందన్నారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, రామ్‌నాయక్, సురేంద్ర, సుధాకర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 3న సర్వసభ్య సమావేశం

జూపాడుబంగ్లా: నవంబర్ 3వ తేదీన జూపాడుబంగ్లా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు పాల్గొనాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను సభదృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాలటౌన్: ప్రయణికులకు మెరుగైన సేవలు అందించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు 9959225800 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

నంద్యాల(అర్బన్): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు పోరాటాలు సాగిస్తామని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి, రాష్ట్ర నాయకులు వాడాల నాగరాజు తెలిపారు. గురువారం గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రజకుల ఆత్మగౌరవ సభకు లక్షలాదిగా రజకులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక నిశాంత్ భవన్‌లో ఏపీ రజక ఎస్సీ సాధన చైతన్య సమితి ఆధ్వర్యంలో బుధవారం రజక ఆత్మ గౌరవ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అనాదిగా కులవృత్తులతో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న రజకుల సమస్యల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నందవరం శ్రీనివాసులు, కె.మధు, వెంకటేష్, శీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిందితులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వివిధ కేసులకు సంబంధించిన ముగ్గురు నిందితులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి బుధవారం జైలు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తుండగా కోకిల అనంతయ్య మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జడ్జి 10రోజుల జైలు శిక్ష విధించారు. మరో కేసు మనగిరి మహేష్ అనే నిందితుడు ఎన్‌జీఓ కాలనీలోని రోడ్డుపై ఆడవారిపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా.. పదిరోజులు జైలు శిక్ష ఖరారు చేశారు. అదే విధంగా మరో కేసులో కొమ్ము శుభాష్ గోపాల్‌నగర్‌లో ఆడవారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికుల సమాచారం అందివ్వడంతో టూటౌన్ పోలీసులు అతనిపై 294 సెక్షన్ కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో దేవస్థానం ఉద్యోగి మృతి



మల్లికార్జునరెడ్డి (ఫైల్)

మహానంది: శ్రీశైలం ఆలయం నుంచి బదిలీపై మహానందికి వచ్చిన జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరెడ్డి(32) బ్రెయిన్‌స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి శ్రీశైలంలో పనిచేస్తూ రెండేళ్ల క్రితం బదిలీలపై మహానందికి వచ్చారు. గత కొద్దిరోజులుగా సెలవుల్లో ఉన్న ఆయనకు బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్లికార్జునరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి గతంలోనే మృతి చెందారు. ఇటీవల పెళ్లి సంబంధాలు చూస్తుండగా అంతలోనే ఇలా జరగడం, ఒక్కగానొక్క కుమారుడు మృతితో తల్లి కృష్ణవేణి, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

రెడ్‌క్రాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: రెడ్‌క్రాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, అందులో వలంటీర్లుగా నమోదు చేసుకోవాలని యువతీ యువకులకు, స్వచ్ఛంద సంస్థలకు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జూనియర్ యూత్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 8, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు జూనియర్ రెడ్‌క్రాస్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ టీములో ఉన్న విద్యార్థులకు సమాజానికి ఉపయోగపడే విధంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ పుల్లయ్య, రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, డీఈఓ సుధాకర్, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

రబీ సీజన్‌లో పంటలు సాగు చేయొద్దు

నందికొట్కూరు: రబీ సీజన్‌లో కేసీ కెనాల్ కింద రైతులు పంటలను సాగు చేయొద్దని కేసీ కెనాల్ ఏఈ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. బుధవారం పాములపాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో రబీ సీజన్‌లో ఏ పంటలు రైతులు వేయకూడదని చెప్పారు. పంటలు వేసి నష్టపోవద్దని హెచ్చరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్డును అందజేస్తున్న ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ

మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదని ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మిడుతూరు-1 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి , ఎంపీటీసీ దేవమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసిల్దార్ ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త పాలమర్రిలో జగనన్న ఆరోగ్య సురక్ష

పగిడ్యాల: మండలంలోని కొత పాలమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ బుధవారం తెలిపారు. కర్నూలు నుంచి స్పెషలిస్టు వైద్యులు హాజరవుతున్నా ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, గ్రామ వలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రేపు తూడిచెర్లలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామంలో ఈనెల 27న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ బాలమద్దిలేటి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పారుమంచాల, జూపాడుబంగ్లా ప్రాథమిక వైద్యశాలల వైద్యులతో పాటు అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మసీదుపురంలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

మహానంది: మసీదుపురం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ఉంటుందని, ప్రముఖ వైద్య నిపుణులు వైద్యసేవలు అందిస్తారన్నారు. గ్రామ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పుస్తకపఠనంతో విజ్ఞానం



డీఎస్పీ శ్రీనివాసరావు యాదవ్‌ను సన్మానిస్తున్న పుస్తక దాతలు

ఆత్మకూరు: విద్యార్థులు, ప్రజలు అనునిత్యం పుస్తకపఠనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు యాదవ్ అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో డీఎస్పీ బుధవారం నూతన పుస్తకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వలన తెలియని అంశాలు తెలుసుకోవచ్చని, పోటీ పరీక్షల్లో రాణించవచ్చని తెలిపారు. అనంతరం పుస్తక దాతలు శివరామకృష్ణ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు తిరుపతయ్యలు డీఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్, జయకృష్ణ యాదవ్, పువ్వాడ భాస్కర్, గ్రంథాలయాల నిర్వాహకులు రాకేష్,. డా.షేక్షావలి, శ్రీధర్‌గుప్త, ప్రసాద్, రమణయాదవ్ పాల్గొన్నారు,

విద్యార్థులకు తప్పిన ప్రమాదం



ముందు చక్రాలు ఊడిన బస్సు

మహానంది : బండిఆత్మకూరు మండలంలోని మోడల్ స్కూల్‌కు విద్యార్థులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు టైర్లు ఊడిపడిన ఘటనలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. బుధవారం మండలంలోని కడమలకాల్వ, ఈర్నపాడు, శింగవరం గ్రామాల నుంచి బస్సులో విద్యార్థులను ఎక్కించుకొని బండిఆత్మకూరులోని మోడల్ స్కూల్‌కు బస్సు బయలుదేరింది. అందులో దాదాపు 40 మంది విద్యార్థులు ఉన్నారు. శింగవరం నుంచి బండిఆత్మకూరు వెళ్లే మార్గంలో బస్సు ముందుటైర్లు ఊడిపడ్డాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

మహానంది: మండలంలోని మూడు గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి బుధవారం తెలిపారు. 26న అబ్బీపురం, 27న తమ్మడపల్లె, 28న తిమ్మాపురం గ్రామాల్లోని సచివాలయాల వద్ద స్పెషల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సేవలు పొందాలని సూచించారు.

28న కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 28న ఆత్మకూరు పురపాలక సంఘం సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. సమావేశంలో పట్టణంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడం జరుగుతుందన్నారు. చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి కో ఆప్షన్ సభ్యులు, వార్డు సభ్యులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

సారా విక్రేత అరెస్టు

మిడుతూరు: మండల పరిధిలోని చౌట్కూరు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన స్వాములు అనే వ్యక్తి సారా విక్రయిస్తుండగా సమాచారం మేరకు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ జగన్‌మోహన్ బుధవారం తెలిపారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడినా, అక్రమ మద్యం, నాటుసారా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పండ్లతోటల సాగుపై శిక్షణ

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరానికి గాను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్లతోటలు నాటుకున్న రైతులకు ఉద్యానశాఖ సమన్వయంతో యాజమాన్య పద్ధతులపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామచంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లాలో 28 మండలాలకు చెందిన 1793 మంది రైతులు 3032 ఎకరాల్లో పండ్లతోటలు సాగు చేశారని, వీరందరికీ మండల స్థాయిలో ఎంపీడీవో, ఎన్ఆర్ఈజీఎస్ పీవో/ఏపీవోల ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 9 వరకు శిక్షణ ఇస్తామన్నారు. ఆయా మండలాల ఏపీవోలు, ఈసీఎస్‌లు, గ్రామాల టీఏలు, ఎఫ్ఏలు రైతులతో మాట్లాడి నిర్ణయించిన తేదీల వారీగా శిక్షణా తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. జిల్లాలో ఎక్కువగా మామిడి, కొబ్బరి, మునగ, జామ, సీతాఫలం, నేరేడు, చీని, నిమ్మ సాగు చేశారని, ఆయా తోటల్లో తెగుళ్ల-సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, సేంద్రీయ ఎరువులు, అంతర పంటలు, నీటి యాజమాన్యంపై ప్రధానంగా శిక్షణ ఇస్తామని వెల్లడించారు.

గోశాల పేరుతో జగనన్న ఇళ్ల స్థలాల కబ్జా



బిజినవేములలో లబ్ధిదారులకు కేటాయించిన స్థలంలో వేసిన గడ్డివామి



ప్రభుత్వం అందించిన పట్టాలను చూపుతున్న బిజినవేముల గ్రామస్తులు

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను అదే గ్రామానికి చెందిన ఆవుల శ్రీను అనే వ్యక్తి గోశాల పేరుతో అక్రమించుకున్నట్లు లబ్ధిదారులు అంజినమ్మ, అబ్దుల్‌రహీం, వర్ల గాయత్రి, రాఘవేంద్ర వాపోయారు. వారు మాట్లాడుతూ 410 సర్వే నెంబర్‌లో ప్రభుత్వం 154 మంది లబ్ధిదారులకు పక్కా గృహాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించిందన్నారు. అయితే ప్రభుత్వం గుర్తించిన స్థలాన్ని ఆవుల శ్రీను అనే వ్యక్తి ఆక్రమించుకుని గడ్డివాములు వేసి 24 మంది లబ్ధిదారుల ఇళ్లు కట్టనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం తమకు ఇంటి పట్టాలను అందించి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ తాము ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నామని వాపోయారు. ఈ విషయంపై గతంలో జేసీగా ఉన్న నారపురెడ్డి మౌర్యాకు, పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. విచారమ జరిపి న్యాయం చేయాలని జేసీ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారని, అయినా తమకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదన్నారు. గడ్డివాములు వేసుకున్న వ్యక్తికి అధికారులు వేరే చోట స్థలం చూపించినా వెళ్లడంలేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గడ్డివాములను తొలగించి తమకు స్థలం కేటాయిస్తే బాగుంటుందని కోరారు.

వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం..

స్థలం ఆక్రమణ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిని వివరణ కోరగా స్థలం ఆక్రమణ విషయంపై గతంలో తమకు ఫిర్యాదులు వచ్చాయని, ఆక్రమణ దారుడికి నోటీసులు కూడా జారీ చేశామని ఆమె తెలిపారు. అయినా అతను స్పందించడం లేదని చెప్పారు. విచారణ జరిపి వారం రోజుల్లో సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు స్థలాలు చూపిస్తామని తెలిపారు.